మన మీ.. వార్త
ప్రతి అక్షరం... ప్రజల కోసం
TGBIL/25/A0512
ఖమ్మం
భద్రాద్రి కొత్తగూడెం
ఆదివారం
08 నవంబర్ 2026
పేజీలు : 4
@mvaartanews
www.mivaartanews.com

రైతులను తక్షణమే ఆదుకోండి.
ముగ్గురు మంత్రులున్నా రైతుపై నిర్లక్ష్యమేంటి.

- తుఫాన్ నష్టానికి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలి
- కరవు మండలాలు ప్రకటించి చేతులు దులుపుకున్నారు.
- సీపీఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్

ఖమ్మం, నవంబర్ 7,మీ వార్త ప్రతినిధి.

మురసు తుఫాన్, ఈదురు గాలుల దాటికి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా వరి, పత్తి, మిర్చి తదితర పంటలు నేలకొరిగి రైతులకు అపార నష్టం వాటిల్లిందని, తీవ్రంగా నష్టపోయిన రైతాంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి ఆదుకోవాలని సీపీఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు.ఈ మేరకు అయన శనివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. పంటలు చేతికొచ్చే ఆఖరి క్షణంలో సంభవించిన ఈ ప్రకృతి వైపరీత్యం రైతులను కోలుకోలేని దెబ్బ తీసిందని, సాగు పెట్టుబడుల కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం లేక రైతన్నలు తీవ్ర మానసిక ఆందోళనలో, ఇబ్బందుల్లో కూరుకుపోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

ఖమ్మం జిల్లాలో నమోదైన ప్రాథమిక అంచనాల ప్రకారం సుమారు 83,000 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని ఆయన తెలిపారు. అందులో అత్యధికంగా 50,000 ఎకరాల్లో పత్తి పంట దెబ్బతినగా, 25,000 ఎకరాల్లో వరి, 8,000 ఎకరాల్లో మిర్చి పంటలు మునిగిపోయి రైతులకు అపార నష్టాన్ని మిగిల్చాయని వివరించారు. ఖమ్మం జిల్లాతో పాటు పొరుగు జిల్లాలో కూడా తీవ్ర ప్రభావం పడిందని, అక్కడ మరో 10,000 ఎకరాలకు పైగా పంటలకు నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. ఇందులో వరి 6,200 ఎకరాలు, పత్తి 2,700 ఎకరాలు, మినుము 1,200 ఎకరాల చొప్పున పంటలు దెబ్బతిన్నట్లు ఆయన వెల్లడించారు.



జిల్లాలోని సత్తుపల్లి, పెనుబల్లి, మధిర, ఏన్కూరు, తల్లాడ, వేంసూరు, జూలూరుపాడు, కొణిజర్ల మండలాల్లో తుఫాను ప్రభావం చాలా తీవ్రంగా ఉందని నున్నా నాగేశ్వరరావు తెలిపారు. ముఖ్యంగా సత్తుపల్లి మండలంలో 21.8 సెంటీమీటర్లు, పెనుబల్లి మండలంలో 22.52 సెంటీమీటర్ల మేర కురిసిన వర్షపాతం వల్ల కోతకొచ్చిన వరి చేలు నేలవాలి పూర్తిగా నీటమునిగాయని, అలాగే పత్తి కాయలు వర్షానికి తడిసి నల్లబడి పనికిరాకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల వల్ల జిల్లా వ్యాప్తంగా రైతులు ఎంతో నష్టపోయి ఆర్థికంగా దిక్కుతోచని స్థితిలో పడ్డారని పేర్కొన్నారు.

తుఫాను వల్ల జరిగిన మొత్తం నష్టం విలువ ఎంత అనేది ఇంకా అధికారికంగా లెక్క తేల్చ లేదని నున్నా నాగేశ్వరరావు అన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో తక్షణమే పర్యటించి సర్వే జరిపి నష్టపోయిన రైతుల వివరాలు, పంట నష్టంపై రాబోయే 2-3 రోజుల్లో పూర్తిస్థాయి నివేదికను ప్రభుత్వానికి సమర్పించాలని ఆయన కోరారు. అలాగే బాధితులకు తగిన న్యాయం జరిగేలా పంటల వారీగా ఎకరాకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఆహార పంటలైన వరి ధాన్యానికి ఎకరాకు రూ. 30,000, వాణిజ్య పంటలైన మిర్చి, పత్తి రైతులకు ఎకరాకు రూ. 50,000, అలాగే ఇతర పంటలకు ఎకరాకు రూ. 20,000 చొప్పున ప్రభుత్వం తక్షణ పరిహారం చెల్లించి రైతాంగాన్ని ఆదుకోవాలని నున్నా నాగేశ్వరరావు స్పష్టం చేశారు.తుఫాన్, వరదల వల్ల జరిగిన పంట నష్టానికి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించి, సత్వరమే రైతులను ఆదుకోవాలని పేర్కొన్నారు.యుద్ధ ప్రాతిపదికన క్షేత్ర స్థాయిలో అధికారులు పర్యటించి, ఏ రైతు పంట ఎంత నష్టం జరిగిందో వివరాలు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. వివరాలు నమోదులో ఎటువంటి అలసత్వాన్ని సహించేది లేదన్నారు. జిల్లాలో ముగ్గురు మంత్రులున్నా ఇంతవరకు రైతుకు పరిహారం ప్రకటించలేదని చెప్పారు. కనీసం అధికారులకు రాతపూర్వక ఆదేశాలు కూడా జారీ చేయకపోవడం శోచనీయమని అన్నారు.ముగ్గురు మంత్రులుండి జిల్లాకు ఒరగబెట్టిందేమి లేదని, జిల్లాలోనే వ్యవసాయ శాఖ మంత్రి, ప్రకృతి విపత్తుల శాఖ మంత్రి,నిధులోచ్చే ఆర్థిక మంత్రి ఉన్నా రైతులకు ఇంత వరకు ఒక్క పైసా పరిహారం అందలేదని మండిపడ్డారు.మంత్రులకు రైతులను పట్టించుకునే తీరికలేకుండా పోయిందని అన్నారు.ఇప్పటికైనా జిల్లా మంత్రులు, ప్రభుత్వం స్పందించి తుఫాన్ బాధిత రైతాంగాన్ని,ప్రజలను ఆదుకోవాలని కోరారు.అలాగే ఖమ్మం జిల్లాలో గతంలో ప్రకటించిన కరవు మండలాల్లో తక్షణమే కరవు సహాయక కార్యక్రమాలను చేపట్టాలని డిమాండ్ చేశారు.కరవు మండలాలను ప్రకటించి చేతులు దులుపుకున్నారు తప్ప బాధిత రైతులకు చేసిందేమి లేదన్నారు. , తక్షణమే కరవు నివారణకు చర్యలు తీసుకుని రైతులను, ప్రజల్ని అన్ని విధాలా ఆదుకోవాలని నున్నా కోరారు.కరవు మండలాలుగా ప్రకటించని మిగతా నాలుగు మండలాలను కూడా కరవు జాబితా లో చేర్చి, రైతులను ఆదుకోవాలని నున్నా నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పేదల ఇళ్లలో పండుగ వెలుగులు నింపేందుకు మంత్రి పొంగులేటి పర్యటన.

- పాలేరు నియోజకవర్గంలో మూడు మండలాల్లో షెడ్యూల్
- మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి కార్యక్రమాల్లో పాల్గొననున్న శీనన్న.

ఖమ్మం, నవంబర్ 07,మీ వార్త ప్రతినిధి.

ఖమ్మం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల కుటుంబాల్లో దీపావళి పండుగ వెలుగులు నింపేందుకు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాలేరు నియోజకవర్గంలో పర్యటించనున్నారు. 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమాల్లో భాగంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారితో కలిసి పండుగ సంబరాల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో కలిసి బాణాసంచా కాల్చి దీపావళి వేడుకలను జరుపుకోనున్నారు. పర్యటనలో భాగంగా ఆదివారం ఉదయం 8:30 గంటలకు ఖమ్మం రూరల్ మండలం కామంచికల్‌లో, 9:30 గంటలకు నేలకొండపల్లి మండలం కోరట్లగూడెంలో, 10:30 గంటలకు కూసుమంచి మండలం పాలేరులో జరిగే కార్యక్రమాలకు మంత్రి హాజరవుతారు. మూడు మండలాల్లోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మమేకమై వారి ఇళ్లలో దీపావళి సంబరాలను పంచుకోనున్నారు.ఈ మేరకు మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.



రఘునందన్ యాదవ్ ను అభినందించిన మల్లి బాబు యాదవ్, చిత్తారు సింహాద్రి యాదవ్

కామేపల్లి, నవంబర్ 7 మీ వార్త ప్రతినిధి :

తెలంగాణ రాష్ట్ర యాదవ ఫెడరేషన్ చైర్మన్ రఘునందన్ యాదవ్ ను హైదరాబాద్ లోని వారి స్వగృహంలో ఖమ్మం జిల్లా అఖిల భారత యాదవ సభ జిల్లా గౌరవాధ్యక్షులు మేకల మల్లి బాబు యాదవ్, జిల్లా అఖిలభారత యాదవ మహాసభ యువజన అధ్యక్షులు చిత్తారు సింహాద్రి యాదవ్ లు తెలంగాణ రాష్ట్రయాదవ్ ఫెడరేషన్ చైర్మన్ గా నియమితులైన రఘునందన్ యాదవ్ ను అభినందించి,పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా మల్లిబాబు యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బీసీ కులాలలో అత్యధిక జనాభా కలిగిన యాదవులకు గౌరవంగా కులవృత్తి పరంగా గతంలో ఎన్నడూ లేని విధంగా యాదవ కార్పొరేషన్ చైర్మన్ ఏర్పాటు చేసిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దక్కిందని, ఈ సందర్భంగా వారికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నట్లు తెలిపారు.యాదవుల అభివృద్ధి కోసం సంక్షేమం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసి మూడు సంవత్సరములు గడించినప్పటికీ ఎలాంటి పథకాలు ప్రకటించకపోవడం, జనాభాపరంగా చట్టసభలలో యాదవ ప్రజా ప్రతినిధులు లేకపోవడం దురదృష్టకరమని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడానికి యాదవులు కీలకపాత్ర వహించారని, ఎన్నికలలో చేసిన వాగ్దానాలను వెంటనే నెరవేర్చాలని, కోకాపేటలోని యాదవ భవనాన్ని వెంటనే ప్రారంభించాలని, యాదవ విద్యార్థులకు హాస్టల్ వసతి సౌకర్యం కల్పించాలని గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ, జిల్లాస్థాయిలో డిసిసిబి చైర్మన్, జడ్పీ చైర్మన్ లు గా యాదవులకు అవకాశం ఇవ్వాలని మల్లి బాబు యాదవ్ కోరారు. యాదవుల కొరకు ప్రత్యేక పథకాలను చేపట్టాలని, ముఖ్యమంత్రికి విన్నవించడం జరిగిందని, దీనిపై వారు వెంటనే స్పందించి యాదవులు మా పార్టీకి ఆయువు పట్టులాంటి వారని , కొద్దికాలంలో యాదవ అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రకటించనున్నట్లుగా హామీ ఇచ్చారని రఘునందన్ యాదవ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో మానవ హక్కుల పరిరక్షణ డైరెక్టర్ మల్లికార్జున్,తుప్పాతి రవి, పోట్లపల్లి సాయికృష్ణ , ఉరబిండి వెంకన్న ,దేగల రాజు చిలకల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.





విబీజీ రాంజీ పనులు పరిశీలించిన ముచ్చర్ల సర్పంచ్ లూసీ

కామేపల్లి, నవంబర్ 7 మీ వార్త ప్రతినిధి:

కామేపల్లి మండలం ముచ్చర్ల పంచాయతీ లో వీబీజీ రాంజీ పథకం ద్వారా నిర్వహిస్తున్న పనులను సర్పంచ్ జాటోత్ జాయ్ లూసీ శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు

. అదే విధంగా గ్రామంలో ఇంకా మరుగుదొడ్లు,ఇంకు డుగుంతలు లేనివారిని సైతం గుర్తించడం జరిగింది.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పి. అనురాధ,ఉపసర్పంచ్ , ఫీల్డ్ అసిస్టెంట్ మంజుల, పంచాయతీ సిబ్బంది, కూలీలు తదితరులు పాల్గొన్నారు.



నారాయణ పాఠశాలలో ఘనంగా దీపావళి వేడుకలు.





ఖమ్మం, నవంబర్ 07,మీ వార్త ప్రతినిధి.

ఖమ్మం నారాయణ పాఠశాలలో దీపావళి వేడుకలను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు దీపాలు వెలిగించి, పండుగ విశిష్టతను తెలియజేస్తూ వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ జి. నవీన్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ దీపావళి పండుగ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అని తెలిపారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని కాలుష్యాన్ని అరికట్టే విధంగా పండుగను జరుపుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

ఇందిరమ్మ ఇండ్లలో దీపావళి వేడుకలు

కారేపల్లి నవంబర్ 7 మీ వార్త ప్రతినిది:



, సింగరేణి మండలంలోని రావోజీ తండా గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారురడు బానోతు బద్రు ఇంట్లో నిర్వహించిన ఇందిరమ్మ ఇంట్లో దీపావళి కార్యక్రమం శనివారం నిర్వహించారుఈ సందర్భంగా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి పోస్టర్‌ను గ్రామ సర్పంచ్ భూక్య బాలు నాయక్ పంచాయతీ కార్యదర్శి కొండపల్లి అనిల్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం మంజూరు చేసిన పైకంతో ఇల్లు నిర్మించుకొని ఎంతో ఆనంద ఉత్సాహలమధ్య దీపావళి పండుగ వేడుకలను నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుకి ప్రభుత్వ పథకాలు అందజేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. పంచాయితీ అభివృద్ధి లక్ష్యంగా పనిచేయడంతో పాటు పంచాయతీలో మౌలిక వసతులు కల్పించినందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు దీపావళి పండుగ స్టిక్కర్లు పంపిణీ

కామేపల్లి, నవంబర్ 7 మీ వార్త ప్రతినిధి:



కామేపల్లి మండలం లో ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు శనివారం అ ధికారులు మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి స్టిక్కర్లు పంపిణీ చేశారు.మండల పంచాయతీ అధికారి వివిఎస్ శాస్త్రి,మండల ప్రజా పరిషత్ సూపరిండెంట్ తన్నీరు నరేందర్ లబ్ధిదారులకు దీపావళి స్టిక్కర్లు పంపిణీ చేశారు.ప్రజా పాలన ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగం ఆదేశాల మేరకు ఎంపీడీవో ధరావత్ సోంలాల్ ఆధ్వర్యంలో ఆదివారం పండుగ సందర్భంగా ముందుగా వారు స్టిక్కర్లను పంపిణీ చే శారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఎం.వెంకటేశ్వర్లు, విజయ, మండల పరిషత్ సిబ్బంది, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారు లు తదితరులు పాల్గొన్నారు.

20 లక్షలతో డైవర్షన్ రహదారి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే జారె

ములకలపల్లి నవంబర్ 7 మీ వార్త ఆర్ సి వనమాల శ్రీనివాసరావు:



అశ్వారావుపేట నియోజకవర్గం ములకలపల్లి మండలం మూకమామిడి మొగరాలగుప్ప గ్రామాల మధ్య ఉన్న హై లెవెల్ వంతెన ఇటీవల మురసు తుఫాన్ ప్రభావంతో తీవ్రంగా దెబ్బతిని ధ్వంసమైంది దీంతో వంతెన అవతలి గ్రామాల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ వెంటనే స్పందించి ప్రభుత్వం నుంచి రూ.20 లక్షల నిధులు కేటాయించి తాత్కాలిక డైవర్షన్ రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టి పనులను ప్రారంభించారు.

రెండు మూడు రోజుల్లో డైవర్షన్ రహదారి నిర్మాణం పూర్తి చేసి వంతెన అవతలి గ్రామాలకు రాకపోకలు పునరుద్ధరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా పనులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు.

విద్యార్థులకు ఐడెంటిటీ కార్డుల పంపిణీ

- రూ.3 వేల విలువైన కార్డులను అందజేసిన చల్లగుండ్ల వెంకటరామయ్య

నేలకొండపల్లి నవంబర్:07 మీ వార్త ఆర్ సి



బోదులబండ: విద్యార్థుల విద్యాభివృద్ధితో పాటు వారి సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని బోదులబండ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు చల్లగుండ్ల వెంకటరామయ్య సుమారు రూ.3,000 విలువైన స్టూడెంట్ ఐడెంటిటీ కార్డులను అందజేశారు. విద్యార్థుల పట్ల తనకున్న అభిమానంతో పాటు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తనవంతు సహకారం అందించాలనే ఉద్దేశంతో ఆయన ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

ఈ సందర్భంగా ఐడెంటిటీ కార్డులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనంత నరేంద్రకు అందజేశారు. విద్యార్థులకు ఐడెంటిటీ కార్డులు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని, పాఠశాలలో విద్యార్థుల గుర్తింపునకు, క్రమశిక్షణకు ఇవి దోహదపడతాయని పలువురు అభిప్రాయపడ్డారు. విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంలో దాతలు, గ్రామ పెద్దలు ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను ప్రోత్సహించేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ తమవంతు సహకారం అందించాలని ఈ సందర్భంగా పలువురు ఆకాంక్షించారు. విద్యార్థుల అవసరాలను గుర్తించి ఐడెంటిటీ కార్డులు అందజేసిన చల్లగుండ్ల వెంకటరామయ్యను పాఠశాల వర్గాలు అభినందించాయి.

ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సర్పంచ్ కట్టెకోల నాగార్జున, డాక్టర్ అహ్మద్, పాఠశాల నిర్వహణ కమిటీ (ఎస్.ఎం.సి.) చైర్మన్ శ్రీమతి భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఎన్ టివి కెమెరామెన్ సతీమణికి టి జె ఎఫ్ జర్నలిస్టుల పరామర్శ ఆర్థిక సహాయం.



ఖమ్మం నవంబర్ 7,మీ వార్త ప్రతినిధి.

ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎన్ టీవీ సీనియర్ కెమెరామెన్ వడ్డే పృధ్వి సతీమణి వడ్డే చైతన్య ఇటీవల ఖమ్మం బైపాస్ రోడ్ లో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ సమాచారం తెలుసుకున్న తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి చిర్రా రవి, జాతీయ కౌన్సిల్ సభ్యులు వెన్నబోయిన సాంబశివరావు లతో కూడిన జర్నలిస్టుల బృందం చైతన్యను పరామర్శించారు. ఖమ్మం కరుణగిరి సమీపంలోని సప్తగిరి లో నివాసం ఉంటున్న వడ్డే పృధ్వి ఇంటికి వెళ్లి చైతన్యను పరామర్శించి 10,000 రూపాయల ఆర్థిక సహాయం చేశారు. రోడ్డు ప్రమాదం జరిగిన తీరునుఎపృధ్వి ని అడిగి తెలుసుకున్నారు. టి యు డబ్ల్యూ జె,టి జె ఎఫ్ జర్నలిస్టు యూనియన్ అన్ని విధాలుగా అండగా ఉంటుందని, త్వరగా కోలుకోవాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే టీజేఎఫ్ జాతీయ కౌన్సిల్ సభ్యులు వెన్నబోయిన సాంబశివరావు,జిల్లా ఉపాధ్యక్షులు మందుల ఉపేందర్ ,వనం నాగయ్య, కలువకోలను హరీష్ రాజ్, ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు,కెమెరామెన్ అసోసియేషన్ అధ్యక్షులు నాగరాజు, కె.వి,సతీష్ , నాగేశ్వరరావు, నాగేంద్రబాబు, సుధాకర్, హైమాద్, మోహన్, శివకృష్ణ, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీ అభ్యర్థులకు ఉచిత స్టడీ మెటీరియల్, పుస్తకాల పంపిణీ.

- జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మహ్మద్ ముజాహిద్.

- మైనారిటీ అభ్యర్థులు నవంబర్ 10 లోగా దరఖాస్తు చేసుకోవాలి.

ఖమ్మం, నవంబర్ - 07,మీ వార్త ప్రతినిధి.

తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ స్టడీ సర్కిల్, మైనారిటీల సంక్షేమ శాఖ, హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ పోటీ పరీక్షలు అయిన గ్రూప్-1, 2, 3 , గ్రూప్-4 పరీక్షలు, అలాగే పోలీస్ కానిస్టేబుల్, సబ్ ఇన్స్పెక్టర్ పోటీ పరీక్షలు, కేంద్ర ప్రభుత్వ పోటీ పరీక్షల కొరకు సన్నద్ధమవుతున్న మైనారిటీ అభ్యర్థులకు ఉచిత స్టడీ మెటీరియల్, పుస్తకాలను పంపిణీ చేయనున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మహ్మద్ ముజాహిద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.అర్హత కలిగిన మైనారిటీ ముస్లిం, క్రిస్టియన్, సిక్కు, బౌద్ధ, జైన, పార్శీ అభ్యర్థులు తమ దరఖాస్తులను వి.వెంకటాయపాలెం లో గల కలెక్టరేట్ భవన సముదాయములో రెండవ అంతస్తు ఎస్-29 లోని జిల్లా మైనారిటీస్ సంక్షేమ శాఖ అధికారి కార్యాలయంలో నవంబర్ 10 వ తేదీ వరకు సమర్పించాలని జిల్లా మైనారిటీస్ సంక్షేమ శాఖ అధికారి తెలిపారు. ఇతర వివరాలకు మొబైల్ నెంబర్ 9704003002 ను సంప్రదించాలని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

పట్టభద్రుల ఓటర్ నమోదులో కృషి చేసిన కాంగ్రెస్ శ్రేణులకు కృతజ్ఞతలు.

- జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్.

ఖమ్మం, నవంబర్ 07,మీ వార్త ప్రతినిధి.



పట్టభద్రుల ఓటర్ నమోదు ప్రక్రియలో అంకితభావంతో పనిచేసిన జిల్లా కాంగ్రెస్ నాయకులకు, జిల్లా అనుబంధ సంఘాల అధ్యక్షులకు, బ్లాక్, మండల, పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులకు, కార్యకర్తలకు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ హృదయపూర్వక కృతజ్ఞతాభివందనాలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రుల ఓటర్ నమోదు కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా విజయవంతం చేయడంలో ప్రతి ఒక్క కార్యకర్త ఎంతో శ్రమించారని కొనియాడారు. గ్రామగ్రామాన తిరిగి, పట్టభద్రులను గుర్తించి, వారికి అవగాహన కల్పించి, ఓటర్ నమోదు చేయించడంలో కాంగ్రెస్ శ్రేణులు చూపిన చొరవ అభినందనీయమని అన్నారు.పట్టభద్రుల గొంతుకను శాసనమండలిలో బలంగా వినిపించడానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని, విద్యావంతులైన యువత, ఉద్యోగులు, నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి పార్టీ పక్షాన నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు.ఇదే స్ఫూర్తితో రాబోయే రోజుల్లో కూడా పార్టీ బలోపేతం కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

మురసు తుఫాను నష్టాలపై బీఆర్ఎస్ పార్టీ మీడియా సమావేశం.

ఖమ్మం, నవంబర్ 07,మీ వార్త ప్రతినిధి.





ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పార్లమెంట్ రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య, మరియు మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు మాట్లాడారు. ఈ సమావేశంలో వారు ఇటీవల మురసు తుఫాను వల్ల ఉమ్మడి ఖమ్మం జిల్లాలో జరిగిన తీవ్ర నష్టాన్ని, ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని తీవ్రంగా ఎండగట్టారు.సండ్ర వెంకట వీరయ్య మాజీ శాసనసభ్యులు, సత్తుపల్లి మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ముసురు తుఫాను వల్ల వరి, పత్తి, మిర్చి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి.అధికారికంగా నేటికీ ఎలాంటి సర్వే లేదా పంట నష్ట అంచనా ఆదేశాలు రాలేదు.కేవలం ఖమ్మం జిల్లాలోనే 32,000 ఎకరాల పైన నష్టం జరిగి ఉంటుంది, కానీ పంట నష్టం ప్రాథమిక అంచనా మాత్రం 23,140 ఎకరాలకు జరిగిందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది.క్యాబినెట్ మీటింగ్ లో పంట నష్టంపై చర్చించి రైతులకు భరోసా కల్పించాల్సింది పోయి, గ్లోబల్ సమ్మిట్ పై చర్చించడం శోచనీయం.సత్తుపల్లి నియోజకవర్గంలో కల్లూరు, పెనుబల్లి, తల్లాడ, వేంసూర్, వేములపల్లి, అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో తీవ్ర నష్టం వాటిల్లింది.సత్తుపల్లిలో డబుల్ బెడ్రూమ్ ఇళ్లు కూడా నీట మునిగి పేదలు సర్వస్వం కోల్పోయినప్పటికీ ప్రభుత్వం స్పందించలేదు.కరువు పరిస్థితులు ఉండి రైతులు అల్లాడుతుంటే మంత్రులు హెలికాప్టర్లలో విహారయాత్రలు చేయడం దుర్మార్గం.రాష్ట్రంలో కరువు తాండవిస్తుంటే మరియు ప్రభుత్వం వద్ద డబ్బులు లేవని సీఎం ప్రకటించినప్పటికీ, మంత్రులు హెలికాప్టర్లను విహారయాత్రల మాదిరిగా వాడుకోవడంపై తీవ్ర విమర్శలు చేశారు.మెరుగైన రోడ్డు సౌకర్యాలు, హైవేలు అందుబాటులో ఉండి కేవలం 2 నుంచి 3 గంటల్లో ప్రయాణించగలిగినప్పటికీ, అత్యవసర పరిస్థితి లేకపోయినా హెలికాప్టర్లను దుర్వినియోగం చేస్తున్నారని మండిపడ్డారు.ఎలాంటి హోదా, బాధ్యతలు లేని వ్యక్తులు కూడా ప్రభుత్వ హెలికాప్టర్లు ఎక్కుతూ, సింహం దిగింది అంటూ సోషల్ మీడియాలో రీల్స్ చేసుకుంటూ ప్రజల సొమ్ముతో విర్రవీగుతున్నారని ఎండగట్టారు.ప్రభుత్వ హెలికాప్టర్ల వినియోగానికి ఎలాంటి నిబంధనలు, విధివిధానాలు లేవా అని ప్రశ్నించిన ఆయన, కరువుతో రైతులు అల్లాడిపోతుంటే కాంగ్రెస్ నాయకులు మాత్రం సోషల్ మీడియాలో ప్రచార ఆర్భాటాలకే పరిమితమయ్యారని విమర్శించారు.వద్దిరాజు రవిచంద్ర పార్లమెంట్ రాజ్యసభ సభ్యులు మాట్లాడుతూప్రభుత్వానికి కనీస సోయి ఉంటే ఈ తుఫాను నష్టాన్ని అత్యంత తీవ్రంగా పరిగణించాలి.ఒకవైపు కరువు మండలాలు అని ప్రకటిస్తూనే, మరోవైపు తుఫాను వల్ల చెరువులు తెగి పంటలు మునిగిపోవడం రైతులనుకోలుకోలేనిదెబ్బతీసింది.భద్రాద్రి కొత్తగూడెం ఖమ్మం జిల్లాల్లో దాదాపు 34,000 ఎకరాలకు పైగా పంట నష్టం జరిగినా ప్రభుత్వం ఇమ్మీడియట్ గా రిపోర్ట్ పంపడంలోవిఫలమైంది.జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, డిజాస్టర్ మేనేజ్మెంట్ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ఉన్నప్పటికీ రైతులకు ఎలాంటి న్యాయం జరగడం లేదు.రైతుల సమస్యలను గాలికొదిలేసి మంత్రులు హెలికాప్టర్ పర్యటనలు చేయడం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడమే.ప్రభుత్వం తక్షణమే స్పందించి నష్టపోయిన ప్రతి రైతుకూ ఎకరానికి రూ. 50,000 పరిహారం ప్రకటించి ఆదుకోవాలి.లింగాల కమల్ రాజు మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ మాట్లాడుతు ఎల్ నినో ప్రభావం వల్ల రాష్ట్రంలో కరువు పరిస్థితులు వచ్చాయని ప్రభుత్వమే ప్రకటించింది.

దసరా కంటే ముందు తీసిన పత్తి, మిర్చి పంటలు మంచి రేటుకు అమ్ముకున్నప్పటికీ, ఆ తర్వాత వచ్చిన మురసు తుఫాను వల్ల పత్తి పూర్తిగా దెబ్బతింది.మార్కెట్లో పత్తిని కొనుగోలు చేయడానికి సిసిఐ కేంద్రాలు అందుబాటులో లేకపోవడంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించి మోసపోతున్నారు.కరువు మండలాలుగా ప్రకటించిన ప్రభుత్వాలు, ఆ ప్రాంతాల్లోని రైతులకు, వ్యవసాయ కూలీలకు ఇవ్వాల్సిన ఉపశమన చర్యలను వెంటనే చేపట్టాలి.కేవలం కరువు మండలాలు అని ప్రకటించి చేతులు దులుపుకోవడం ప్రభుత్వ బాధ్యతారాహిత్యానికినిదర్శనం.ఉమ్మడి ఖమ్మం జిల్లాలో తుఫాను మరియు వరదల వల్ల నష్టపోయిన ప్రతి ఎకరా పంటనూ వెంటనే సర్వే చేయించాలని, నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరానికి రూ. 50,000 తక్షణ పరిహారం చెల్లించాలని, సత్తుపల్లి, కొత్తగూడెం నియోజకవర్గాల్లో మునిగిపోయిన ఇళ్ల బాధితులను నివాసితులను ఆదుకోవాలని, తడిసిన, రంగుమారిన, మొలక వచ్చిన ప్రతి గింజను ప్రభుత్వం కొనాలని, వారి మరియు పత్తి రైతులను ఆదుకునేందుకు వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని బిఆర్ఎస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు.ఈ మీడియా సమావేశం లో మండల పార్టీ అధ్యక్షులు బెల్లం వేణుగోపాల్, కనగాల వెంకటరావు,నాయకులు బొమ్మెర రామ్మూర్తి, దోకుపర్తి సుబ్బారావు, లింగనబోయిన సతీష్, బలుసు మురళీకృష్ణ, మహమ్మద్ రఫీ, చీకటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలి

- ఇంచార్జ్ హెడ్మాస్టర్ ఎం. వేణు

కొత్తగూడెం నవంబర్ 7 మీ వార్త ఆర్. సి



మణుగూరులో విద్యార్థులు చిన్నతనం నుంచే శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకొని, పరిశోధనాత్మక ఆలోచనలతో భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని సింగరేణి ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ శ్రీ ఎస్ రమేష్ గారి ఆదేశాల మేరకు, సింగరేణి ఉన్నత పాఠశాల పి వీ కాలనీ, మణుగూరు ఇంచార్జ్ హెడ్మాస్టర్ ఎం. వేణు పిలుపునిచ్చారు

ప్రముఖ భౌతికశాస్త్రవేత్త, భారతరత్న డాక్టర్ సర్ చంద్రశేఖర వెంకట రామన్ జయంతి సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో ఆయన ముఖ్య ఉపన్యాసం చేశారు. ఈ సందర్భంగా సి.వి. రామన్ జీవిత విశేషాలను, విజ్ఞాన శాస్త్ర రంగానికి ఆయన చేసిన అపారమైన సేవలను వివరించారు.

కాంతి కిరణాలపై చేసిన పరిశోధనల ద్వారా ప్రపంచానికి సరికొత్త విజ్ఞానాన్ని అందించిన సి.వి. రామన్, తన ఆవిష్కరణ అయిన రామన్ ఎఫెక్ట్ ద్వారా అంతర్జాతీయ గుర్తింపు పొందారని తెలిపారు. ఈ ఆవిష్కరణకు గాను 1930లో భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి అందుకున్నారని, 1954లో భారతరత్న పురస్కారంతో గౌరవించబడ్డారని పేర్కొన్నారు.

విద్యార్థులు పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా ప్రకృతిలోని ప్రతి అంశాన్ని ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని, ప్రయోగాలు, పరిశీలనలు, నూతన ఆలోచనల ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. సి.వి. రామన్ జీవితం ప్రతి విద్యార్థికి గొప్ప స్ఫూర్తి అని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమాన్ని సీనియర్ ఉపాధ్యాయులు లింగంపల్లి దయానంద్ సమన్వయపరిచారు. విద్యార్థినీ విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను విశేషంగా అలరించాయి.

ఈ కార్యక్రమంలో సీనియర్ సైన్స్ ఉపాధ్యాయులు మస్తానయ్య, రజిత, మమత, ప్రవంతి, రాజియా, శ్రీదేవి, రాజసింహ, ఉపేంద్ర, తహర్ పాషా, కళ్యాణ్, బిందు తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రామవరం ప్రాంతానికి స్థిరాస్తి పేరు మార్పిడి చేయాలి

- సమావేశంలో 16వ డివిజన్ కార్పొరేటర్ మునిగడప పద్మ డిమాండ్

కొత్తగూడెం నవంబర్ 7 మీ వార్త ఆర్ సి





(కార్పొరేషన్) రామవరం ప్రాంత ప్రజలకు వారి స్థిరాస్తి పేర్లు మార్పిడికి అవకాశం కల్పించాలని 16వ డివిజన్ కార్పొరేటర్ మునిగడప పద్మ డిమాండ్ చేశారు. కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మునిగడప పద్మ మాట్లాడుతూ రాముడు ఇచ్చిన వరం మా రామవరం అనుకుంటామే కానీ రామవరం ప్రజలకు ఎలాంటి హక్కులు లేవు, అన్నీ ఉన్న అల్లుడు నోట్లో శని అన్నట్లుగా రామవరపు ప్రాంత ప్రజల దుస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

రామవరం ప్రజల ఓట్లు కావాలి,రామవరం ప్రజల పన్నులు కావాలి,కానీ రామవరం ప్రజలకు నివాస హక్కు ఉండొద్దా! అని సమావేశంలో ప్రశ్నించారు.

కౌన్సిల్లో సభ్యులందరూ రామవరం సమస్య పరిష్కారానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు సహకరించాలని ఆమె సభ్యులకు విజ్ఞప్తి చేశారు.

తాతల,తండ్రుల నాటి పేర్లతోనే పన్నులు కడుతున్న వారి మరణాంతరం వారసుల పేర్లు మార్చటం లేదు. అధికారులు దీనిపై ఒక ఆలోచన చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. వచ్చే సమావేశంలోనైనా ఎజెండాలో పెట్టి ఒక నిర్ణయం తీసుకోవాలని, మేయర్ కి వినతిపత్రం అందజేసి కౌన్సిల్ కి విజ్ఞప్తి చేశారు. అలాగే కోతుల సమస్య పరిష్కారానికి ఇంకా అన్ని డివిజన్లో బోన్లను ఏర్పాటు చేయాలని, అలాగే కుక్కల,పందుల సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. మిషన్ భగీరథ పైపుల లీకేజీలు, గుంటలు పూడ్చడం లో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వీడి తక్షణమే దాని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. సమస్యల పరిష్కారానికి మేయర్ మూడ్ గణేష్,అధికారులు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. సిపిఐ కార్పొరేటర్స్, కార్పొరేషన్, రెవెన్యూ, మెప్మా, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గాలులతో వరి పంటకు తీవ్ర నష్టం మురసు తుఫాన్ తో నష్టపోయిన రైతు

కారేపల్లి నవంబర్ 7 మీ వార్త ప్రతినిధి





ఇటీవల కురిసిన వర్షాల ఫలితంగా మండలంలోని పలు ప్రాంతాల్లో వరి రైతులకు నష్టాన్ని మిగిల్చాయి. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టిన వరి పంట చేతికందే సమయంలో ఈదురుగాలుల ప్రభావంతో వారిపైరు పడిపోవడంతో పలు ప్రాంతాల్లో రైతులకు తీవ్ర నష్టాన్ని బిగించాయి. మురుస తుపానుతో చేతి కంది వచ్చిన వరి పంట క్రింద పడిపోయి నష్టం కలిగిందని సింగరేణి మండలం ఎర్ర బోడు కు చెందిన కురుసం శ్రీను తీవ్రంగా నష్ట పోయాడు. నవంబర్ చివరి నాటికి కోసుకునే విధంగా అర్రు వంచిన పంట ఈ స్థితిలో ఉండడంతో తన పరిస్థితి పట్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నడు. ఇప్పటికే పంటని కాపాడుకోవడం కొరకు అనేక ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ ఫలించని దుస్థితి నెలకొందని వాపోయారు వరి సాగు కోసం ఎరువులు పురుగు మందులు విత్తనాలు దుక్కి దున్నడం వరకు సుమారు ఎకరానికి 30 వేల వరకు ఖర్చు చేశానని అది కూడా అప్పు చేసి పంట వేశానని చెప్పుకొచ్చారు. వ్యవసాయ అధికారులు నా పంటతో పాటు ఇతర రైతుల పంటలను కూడా పరిశీలించి ఆదుకోవాలని వాపోయారు. ప్రభుత్వం వెంటనే తనను ఆదుకోవాలని వేడుకున్నారు.

మురస తుఫాను బాధితులను ఆదుకోవాలి ఇటీవల సంభవించిన మురస తుఫాను కారణంగా నష్టపోయిన వరి ప్రతి మిరప మరియు ఇతర పంటల రైతులను వ్యవసాయ అధికారులు పరిశీలించి ఎకరానికి 50వేల నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం సింగరేణి మండల కార్యదర్శి కే నరేంద్ర విజ్ఞప్తి చేశారు. ఎల్ నినో కారణంగా ఇప్పటికే రైతులు తమ పంటలను ప్రాణపదంగా తన కడుపున పుట్టిన బిడ్డల కంటే మిన్నగా జాగ్రత్తగా సాదుకుంటుండగా మురస తుఫాన్ అకాలంగా వచ్చి రైతులను తీవ్రంగా నష్టపరిచిందని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి రైతుకు 50 వేల చొప్పున నష్టపరిహారం మరియు కుటుంబ జీవనానికి గడిచే విధంగా 14 రకాల నిత్యవసర సరుకులను ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు. లేనియెడల రైతులను కూడగట్టి పోరాడుతామని కె నరేంద్ర హెచ్చరించారు.

నూతన ప్రజాస్వామిక సమాజ సాధనకు కృషి చేయాలి:

- మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

కారేపల్లి, నవంబర్ 7: మీ వార్త ప్రతినిధి





నూతన ప్రజాస్వామిక సమాజ సాధనకు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య పిలుపునిచ్చారు.సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ టేకులగూడెం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో శనివారం అమరవీరుల సంస్మరణ సభ ఘనంగా నిర్వహించారు..మాస్‌లైన్ మండల కార్యదర్శి, టేకులగూడెం సర్పంచ్ గుమ్మడి సందీప్ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్ గుమ్మడి నర్సయ్య ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. భూమి, భుక్తి, విముక్తి కోసం భారత కమ్యూనిస్టు విప్లవోద్యమం 1969లో నక్సల్బరి ఉద్యమం నుంచి ప్రారంభమై శ్రీకాకుళం, గోదావరి లోయ, ఖమ్మం, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ తదితర జిల్లాలకు విస్తరించిందని అన్నారు. ఈ ఉద్యమ క్రమంలో భూస్వామ్య దోపిడీ, సామాజిక అసమానతలు, అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడుతూ ఎందరో విప్లవకారులు రాజ్యహింసకు నేలకొరిగారన్నారు., ప్రజల విముక్తి కోసం తమ ప్రాణాలను అర్పించిన వారంతా విప్లవోద్యమ అరుణతారలని కొనియాడారు.భారత విప్లవోద్యమంలో ప్రముఖ నాయకులైన దేవులపల్లి వెంకటేశ్వరరావు, చంద్ర పుల్లారెడ్డి, తరిమెల నాగిరెడ్డి, కొల్లా వెంకయ్య, సత్యనారాయణ సింగ్, కాను సన్యాల్, చారు మజుందార్ తదితరులు విప్లవోద్యమ నిర్మాణం కోసం తమ జీవితాలను అంకితం చేశారని గుర్తుచేశారు.శ్రీకాకుళం విప్లవోద్యమంలో పంచాది కృష్ణమూర్తి, నిర్మల, ఆదిభట్ల కైలాసం, చాగంటి భాస్కరరావు, దేవినేని మల్లికార్జున్, సుబ్బారావు పాణిగ్రాహి, రమేష్ చంద్ర సాహూ తదితరుల నుంచి పైల వాసుదేవరావు, చంద్రమ్మ, జయమ్మ, కుమార్ వరకు అనేకమంది ప్రజా ఉద్యమాల కోసం ప్రాణాలర్పించారని తెలిపారు.అదేవిధంగా గోదావరి లోయ విప్లవోద్యమంలో ప్రజా పోరాటాల్లో ఎంతోమంది ఉద్యమ నాయకులు అమరులయ్యారని అన్నారు. అలాగే కోటన్న, సీతారామారావు, సుసేన, చింతలక్ష్మి, సోముల పరశురాములు, మాధవ్ అన్న, విక్రమ్ అన్న, ఎల్లన్న, మురళి, పగడాల వెంకన్న, ముస్మి, గణేష్, ఏనుగు అప్పయ్య, సీతక్క, గడ్డం వెంకట నరసమ్మ, రాయల చంద్రశేఖర్, యాదన్న తదితరులు విప్లవోద్యమంలో తమ ప్రాణాలను త్యాగం చేశారని గుర్తుచేశారు. టేకులగూడెం గ్రామానికి చెందిన కామ్రేడ్ స్వర్ణపాక లక్ష్మీనరసి, కామ్రేడ్ పాయం లక్ష్మీనారాయణలు ప్రజా ఉద్యమాల కోసం చేసిన త్యాగాలు గ్రామ ప్రజలకు, రాబోయే తరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించాయని విమర్శించారు. దేశంలో పేదలు, రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీలు, నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. అమరవీరుల పోరాట స్ఫూర్తితో నూతన ప్రజాస్వామిక సమాజ సాధన లక్ష్యంగా విశాల ప్రజానీకాన్ని చైతన్యవంతం చేయాలని, ప్రజా సమస్యలపై ఐక్యంగా పోరాడుతూ ప్రజా ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సభలో సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శివర్గ సభ్యులు గుగులోతు తేజ నాయక్, ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వి. రాకేష్, సంయుక్త మండల కార్యదర్శి ధరావత్ సక్రు మండల నాయకులు కొలిసెలం శ్రీను, స్వర్ణపాక అనసూర్య, రామారావు, గుమ్మడి ఎర్రయ్య, నాగేశ్వరరావు, వార్డు సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఖ

మృతుల కుటుంబాలకు అండగా నిలిచిన పీఎస్ఆర్ ట్రస్టు

- ఒక్కో కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేత

నేలకొండపల్లి నవంబర్:07 మీ వార్త ఆర్ సి



నేలకొండపల్లి: ఆపదలో ఉన్న కుటుంబాలను ఆదుకోవడమే లక్ష్యంగా పీఎస్ఆర్ ట్రస్టు సేవా కార్యక్రమాలను కొనసాగిస్తోంది.ఈ క్రమంలో నేలకొండపల్లి మండల పరిధిలో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేసి అండగా నిలిచింది.ఒక్కో బాధిత కుటుంబానికి రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం అందించి,కష్టకాలంలో వారికి భరోసా కల్పించింది.

కుటుంబ పెద్దను లేదా ఆత్మీయులను కోల్పోయిన కుటుంబాలు తీవ్ర మనోవేదనతో పాటు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్న నేపథ్యంలో వారికి తోడుగా నిలవాలనే ఉద్దేశంతో ఈ సహాయ కార్యక్రమాన్ని చేపట్టారు.బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించడం ద్వారా వారి కష్టాల్లో పాలుపంచుకుంటూ, మానవతా దృక్పథంతో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

సమాజంలో ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, బాధిత కుటుంబాలకు అండగా నిలవడం ద్వారా వారికి కొంతైనా ఊరట కల్పించవచ్చని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు.పేద, నిరుపేద కుటుంబాలకు అవసరమైన సమయంలో సహాయం అందించడం అభినందనీయమని తెలిపారు.

ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి మండల కాంగ్రెస్ నాయకులు మామిడి వెంకన్న, పసుపులేటి ఉపేందర్ రావు,జెర్రిపోతుల అంజనీ,గుడిబైన వెంకటేశ్వర్లు, మల్లయ్య,ఐ.శ్రీను, కాసాని సంపత్, కడియాల నరేష్ తదితరులు పాల్గొన్నారు.వారు బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేసి,వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

ఆపద సమయంలో తమను గుర్తించి ఆర్థిక సహాయం అందించిన పీఎస్ఆర్ ట్రస్టుకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా కొనసాగాలని ఆకాంక్షించారు.

చెరువుమాధారం చెరువును పరిశీలించిన ఇరిగేషన్ సీఈ వాసంతి

- డీవీఆర్ రెగ్యులేటర్ నిర్మాణానికి రూ.2.70 కోట్లతో ప్రతిపాదనలు

- శిథిలావస్థలో ఉన్న మంగాపురంతండా బ్రిడ్జి పరిశీలన - నూతన వంతెన మంజూరుకు వినతి

నేలకొండపల్లి నవంబర్:07 మీ వార్త ఆర్ సి





నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాధారం చెరువును నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజినీర్ (సీఈ) వాసంతి శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చెరువు నీటి నిల్వ సామర్థ్యం, ప్రస్తుతం ఉన్న నీటి నిల్వలు, చెరువుకు అనుబంధంగా ఉన్న కాలువలు, రెగ్యులేటర్ పరిస్థితిపై సంబంధిత అధికారులతో కలిసి వివరాలు సేకరించారు. చెరువు నిర్వహణ, నీటి నిల్వల సంరక్షణ, సాగునీటి సరఫరాకు సంబంధించిన పలు అంశాలను ఆమె పరిశీలించారు.

చెరువుమాధారం చెరువుకు అనుబంధంగా ఉన్న దేవినేని వెంకటరమణ (డీవీఆర్) కాలువ రెగ్యులేటర్ శిథిలావస్థకు చేరడంతో నీరు వృథాగా పోతున్న సమస్యపై ఇటీవల పలు పత్రికల్లో వార్తలు ప్రచురితమయ్యాయి. ఈ నేపథ్యంలో సీఈ వాసంతి స్వయంగా రెగ్యులేటర్‌ను పరిశీలించి, దాని ప్రస్తుత స్థితిగతులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రెగ్యులేటర్ దెబ్బతినడం వల్ల నీటి నిల్వలు, సాగునీటి సరఫరాపై ప్రభావం పడుతున్న అంశాన్ని పరిశీలించారు. ప్రస్తుత రెగ్యులేటర్ స్థానంలో నూతన రెగ్యులేటర్ నిర్మాణం చేపట్టేందుకు అవసరమైన అంచనాలను సిద్ధం చేయాలని సంబంధిత ఇరిగేషన్ అధికారులను సీఈ ఆదేశించారు. రెగ్యులేటర్ నిర్మాణంతో పాటు కాలువ పటిష్టతకు అవసరమైన పనులను కూడా ప్రతిపాదనల్లో చేర్చారు. ఈ పనులన్నింటికీ కలిపి సుమారు రూ.2.70 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రతిపాదిత పనులు పూర్తయితే నీటి వృథాను అరికట్టడంతో పాటు కాలువ నిర్వహణ మరింత మెరుగుపడే అవకాశం ఉందని భావిస్తున్నారు.

శిథిలావస్థలో మంగాపురంతండా బ్రిడ్జి

అనంతరం మంగాపురంతండాలో ప్రధాన కాలువపై ఉన్న బ్రిడ్జిని సీఈ వాసంతి పరిశీలించారు. ఈ వంతెన ప్రస్తుతం శిథిలావస్థకు చేరడంతో ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వంతెన పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని నూతన బ్రిడ్జి మంజూరు చేయాలని సర్పంచ్ ధీరావత్ అశోకరాణి, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఉపాధ్యక్షుడు ధీరావత్ రాధాకృష్ణమూర్తి సీఈకు వినతిపత్రం అందజేశారు.

ప్రజల రాకపోకలకు, స్థానిక అవసరాలకు ఉపయోగపడుతున్న ఈ వంతెన శిథిలావస్థకు చేరడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు వివరించారు. నూతన బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం స్వీకరించిన సీఈ వాసంతి కాలువపై ఉన్న బ్రిడ్జిని క్షేత్రస్థాయిలో పరిశీలించి, దాని ప్రస్తుత పరిస్థితిని అధికారులతో సమీక్షించారు.

చెరువుమాధారం చెరువు రెగ్యులేటర్ నిర్మాణం, కాలువ పటిష్టతతో పాటు మంగాపురంతండా బ్రిడ్జి సమస్య పరిష్కారానికి సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు ఆశిస్తున్నారు.

ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ శ్రీనివాసరెడ్డి, డీఈఈ పొట్టయ్య, కె.దీక్షిత, ఏఈ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కోతుల బెడద.. అడవులు తగ్గడమే కారణమా?

మనుషుల తప్పిదాలే వన్యప్రాణులకు శాపం..

ఆలోచించాల్సిన సమయం ఆసన్నం





కమ్మర్‌పల్లి : గ్రామాల్లో కోతుల బెడద రోజురోజుకూ పెరుగుతోంది. గుంపులు గుంపులుగా గ్రామాల్లోకి ప్రవేశిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తు న్నాయి. ఇళ్లపైకి ఎక్కి ఆహార పదార్థాలను ఎత్తుకెళ్లడం, పండ్లు, కూరగాయల తోటలను ధ్వంసం చేయడం, రోడ్లపై సంచరిస్తూ వాహనదారులకు ఇబ్బందులు కలిగించడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి.అయితే కోతులు అడవులను వదిలి గ్రామాల బాట పట్టడానికి ప్రధాన కారణం ఏమిటి? ఒకసారి ఆలోచిస్తే సమాధానం మనుషుల దగ్గరే కనిపిస్తుంది. అభివృద్ధి పేరుతో అడవులను నరికివేయడం, చెట్లను తొలగించడం, అటవీ ప్రాంతాలను క్రమంగా తగ్గించడం వల్ల వన్యప్రాణుల సహజ ఆవాసాలు కనుమరుగవుతున్నాయి. అడవుల్లో ఆహారం, నీరు, ఆశ్రయం లభించకపోవడంతో కోతులు జనావాసాల వైపు వస్తున్నాయి. ఒకప్పుడు అడవుల్లో స్వేచ్ఛగా జీవించిన కోతులు నేడు గ్రామాల్లో ఆహారం కోసం వెతుక్కునే పరిస్థితి ఏర్పడింది. మనుషులు తమ అవసరాల కోసం ప్రకృతిని నాశనం చేస్తూ, ఇప్పుడు వన్యప్రాణులు గ్రామాల్లోకి వస్తున్నాయని వాటిని నిందించడం ఎంతవరకు సమంజసం?

తప్పు కోతులదా.. మనుషులదా?

ప్రకృతిలో ప్రతి జీవికి జీవించే హక్కు ఉంది. అడవులు వాటి నివాసాలు. వాటి ఆవాసాలను మనమే క్రమంగా తగ్గిస్తూ, వాటి మనుగడకు ఆటంకం కలిగిస్తున్నాం. అందుకే కోతుల సమస్యను కేవలం వన్యప్రాణుల ఇబ్బందిగా కాకుండా పర్యావరణ సమతుల్యత దెబ్బతింటున్న సంకేతంగా గుర్తించాలి. ఇప్పటికైనా అడవుల సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి. గ్రామాల్లో విస్తృతంగా మొక్కలు నాటాలి, చెట్ల నరికివేతను అరికట్టాలి. కోతులకు ఆహారం వేయకుండా, చెత్తను బహిరంగ ప్రదేశాల్లో పడేయకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలి. అటవీ శాఖ అధికారులు కూడా కోతుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలి. అడవులను కాపాడితేనే వన్యప్రాణులు అడవుల్లో ఉంటాయి. ప్రకృతిని కాపాడుకోవడం మన బాధ్యత.

వివాహ వేడుకలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే జారే

- ఆదినారాయణ తాసిల్దార్ మద్దినేని మురళి సర్పంచ్ పగడాలరమాదేవి రాంబాబు

దమ్మపేట నవంబర్ 7 మీ వార్త ఆర్ సి వనమాల శ్రీనివాసరావు:



దమ్మపేట మండలానికి చెందిన దమ్మపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిన్నశెట్టి చిట్టిబాబు కుమారుని వివాహ వేడుకలో అశ్వారావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు జారే ఆదినారాయణ



పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో పాటు తహసీల్దార్ మద్దినేని మురళి, దమ్మపేట సర్పంచ్ పగడాల రామదేవి తదితరులు వివాహ వేడుకకు హాజరై వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

నూతన దంపతులు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు కలిసి జీవించాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులతో కొద్దిసేపు ఆత్మీయంగా గడిపి వివాహ వేడుకకు మరింత ఆనందాన్ని తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో దమ్మపేట మండల అధ్యక్షులు కక్కిరాల రమేష్, ప్రధాన కార్యదర్శి వనమాల శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిన్న చెట్టి యుగంధర్ ,శ్రీరాముల ప్రసాద్, సత్య ప్రసాద్ , పొదిలి జ్యోతి, పగడాల కృష్ణారావు, గట్ల సర్వేశ్వరరావు, పానుగంటి లక్ష్మణ్ గౌడ్, అంగోతు శ్రీనివాసరావు, పిట్టల శ్రీను, గట్ల నాగరాజు ,వేముల శ్రీను పార్టీ నాయకులు, కార్యకర్తలు ,అభిమానులు పాల్గొన్నారు.

ప్రధాన రహదారిలో ఎండిపోయి ప్రమాద భరితంగా ఉన్న భారీ వృక్షం తొలగింపు

కామేపల్లి, నవంబర్ 7 మీ వార్త ప్రతినిధి :



కామేపల్లి మండలం కొమ్మినేపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ముచ్చర్ల క్రాస్ రోడ్ సమీపంలో ప్రధాన రహదారిపై ఎండిపోయి ప్రమాద భరితంగా ఉన్న భారీ వృక్షాన్ని శనివారం తొలగించారు.విద్యుత్ సిబ్బంది పర్యవేక్షణలో జేసీబీ సహాయముతో కొమ్మినేపల్లి సర్పంచ్ దారావత్ అనురాధ, మండల పంచాయతీ అధికారి వీవీఎస్ శాస్త్రి ఆధ్వర్యంలో ఆ వృక్షాన్ని తొలగించి భయాందోళన పరిస్థితి, ప్రమాదాలు జరగకుండా నివారించడం జరిగింది.ఈ విషయంలో వారు చూపిన కృషి పట్టుదలను ప్రయాణికులు, వాహనదారులు, ద్విచక్ర వాహనదారులు, రైతులు, ప్రజలు,స్థానికులు ప్రశంసించారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సైబర్ క్రైమ్ పై అవగాహన ప్రతి విద్యార్థి కలిగి ఉండాలి

కొత్తగూడెం నవంబర్ 22 మీ వా ర ఆర్ సి



కొత్తగూడెంప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, రుద్రంపూర్,లో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు సైబర్ నేరాలు మరియు సమాచార భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.



ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కొత్తగూడెం సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీమతి జుబేదా విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో పెరుగుతున్న సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, సోషల్ మీడియా ద్వారా జరిగే నేరాలు, ఫేక్ లింకులు, ఓటిపి మోసాలు, ఆన్‌లైన్ బ్యాంకింగ్ మోసాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యక్తిగత సమాచారం, బ్యాంకు వివరాలు, పాస్‌వర్డ్‌లు మరియు ఓటీపీ లను ఇతరులతో పంచుకోకూడదని తెలిపారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ బి. కరుణ కుమార్ మాట్లాడుతూ, విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటూ సైబర్ భద్రతపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు.

కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఇన్‌చార్జి శ్రీ రవికుమార్, వివిధ విభాగాల అధిపతులు అధ్యాపకులు మరియు కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల్లో సైబర్ భద్రతపై అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో సైబర్ సిబ్బంది వంశీ, రజిత,తదితరులు పాల్గొన్నారు.

మహిళా కండక్టర్ కుటుంబాన్ని పరామర్శించిన టిడిపి నాయకురాళ్ళు

ఖమ్మం, నవంబర్ 7,మీ వార్త ప్రతినిధి.



ఉమ్మడి ఖమ్మం,భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు డిపోకు చెందిన టీజీఎస్ఆర్టీసీ మహిళా కండక్టర్ గుండ్ల ప్రవళిక 24, మహిళ ప్రయాణికురాలకు టికెట్ ఇచ్చి చిల్లర టికెట్ వెనకాల రాయడంతో తక్షణమే ఇవ్వాలి అంటూ వివాదంలో జరిగిన గొడవ కారణంగా ఆ మహిళ కండక్టర్ ను బస్సు నుండి క్రిందకు త్రోయగా బస్సు వెనకాల టైర్లు ఆమె రెండు కాళ్లపై వెళ్లడంతో పది రోజులపాటు చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం విధితమే ఈ సంఘటన తెలుగు రాష్ట్రాలను కలిచి వేసింది, ఖమ్మం తెలుగుదేశంపార్టీ మహిళా నాయకురాళ్ళు ప్రవళిక స్వగృహానికి మణుగూరు వెళ్లి ప్రవళిక కుటుంబ సభ్యులను వివరాలను అడిగి తెలుసుకొని ఓదార్చి పరామర్శించారు అనంతరం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, తక్షణమే ప్రభుత్వం ఆ కుటుంబాన్ని ఎక్స్గ్రేషియా అందించకపోతే తెలుగుదేశంపార్టీ వారి తరపున అండగా ఉంటుందని ఈ విషయాన్ని టీడీపీ రాష్ట్ర పార్టీకి దృష్టికి తీసుకు వెళ్తామని, వారి కుటుంబానికి అండగా ఉంటామని అన్నారు, వీరిలో టిడిపి రాష్ట్ర నాయకురాలు చలసాని ఝాన్సీ, జిల్లా నాయకురాళ్ళు రాటకొండ పావని, తాడిశెట్టి స్వాతి, కామ అనిత, తదితరులు ఉన్నారు.

జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు టిడిపి నేత వాసిరెడ్డి భాస్కరరావు.

ఖమ్మం, నవంబర్ 7,మీ వార్త ప్రతినిధి.



ఖమ్మం నగరంలో తెలుగుదేశంపార్టీ టిఎన్టియుసి రాష్ట్ర నాయకులు వాసిరెడ్డి భాస్కరరావు, దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని దీపావళి పండుగ సందర్భంగా ఖమ్మం జిల్లా ప్రజానీకానికి హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వెలుగుల పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో ఆనందం, ఐక్యత, సిరిసంపదలను తీసుకురావాలని సుఖసంతోషాలు కలగాలని, నరకాసురుడి వధ అనంతరం ప్రజలు జరుపుకునే ఈ విజయోత్సవం అందరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని ఆకాంక్షించారు.

జిల్లా ప్రజలందరికీ దీపావళి పండుగ శుభాకాంక్షలు.

- ఈ దీపావళి ప్రతి ఇంట్లో చీకటిని పారద్రోలి వెలుగులు నింపాలి.
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.

ఖమ్మం, నవంబర్ 07,మీ వార్త ప్రతినిధి.



దీపావళి పండుగ పురస్కరించుకునిఉమ్మడి జిల్లా ప్రజలందరికీ రాష్ట్ర శాఖ వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల శుభాకాంక్షలు తెలియజేశారు.అందరి ఇండ్లలో చీకట్లు తొలగి సుఖసంతోషాలు,విజయాలు వెల్లివిరియాలని,లక్ష్మీదేవి కటాక్షంతో ప్రతి కుటుంబం వృద్ధి చెందాలని ఆకాంక్షించారు.చిన్నారులు టపాసులు కాల్చేటప్పుడు ఎటువంటి ప్రమాదాలు జరగకుండా పెద్దల సమక్షంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటూ సురక్షితంగా,పర్యావరణ హితంగా గ్రీన్ క్రాకర్స్‌తో ఈ దీపావళి వేడుకను జరుపుకోవాలన్నారు.

అమరవీరుల త్యాగాలు వృథా కానివ్వం..

ప్రజా విముక్తి పోరాటమే లక్ష్యం

టేకులగూడెంలో విప్లవ అమరవీరులకు ఘన నివాళి..

వారి ఆశయ సాధనకు ఐక్యంగా కదలాలి:

మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

కారేపల్లి : ప్రజల హక్కులు, భూమి, భుక్తి, విముక్తి కోసం తమ అమూల్యమైన ప్రాణాలను అర్పించిన అమరవీరుల త్యాగాలు ఎన్నటికీ మరువలేనివని, వారు కన్న కలల సమాజ నిర్మాణం కోసం ప్రజా ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య పిలుపునిచ్చారు. సింగరేణి మండలం టేకులగూడెం గ్రామంలో శుక్రవారం సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అమరవీరుల సంస్మరణ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.మాస్‌లైన్ మండల కార్యదర్శి, టేకులగూడెం సర్పంచ్ గుమ్మడి సందీప్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో గ్రామానికి చెందిన అమరవీరులు కామ్రేడ్ స్వర్ణపాక లక్ష్మీనరసి, కామ్రేడ్ పాయం లక్ష్మీనారాయణతో పాటు వివిధ ప్రజా ఉద్యమాల్లో ప్రాణత్యాగం చేసిన విప్లవ వీరులను స్మరించుకుంటూ రెండు నిమిషాలు మౌనం పాటించి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ.. 1969లో నక్సల్బరి ఉద్యమంతో ప్రారంభమైన భారత కమ్యూనిస్టు విప్లవోద్యమం భూమి, భుక్తి, విముక్తి లక్ష్యంగా దేశవ్యాప్తంగా విస్తరించిందన్నారు. శ్రీకాకుళం, గోదావరి లోయ, ఖమ్మం, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ తదితర ప్రాంతాల్లో భూస్వామ్య దోపిడీ, సామాజిక అసమానతలు, అన్యాయాలకు వ్యతిరేకంగా సాగిన పోరాటాల్లో ఎందరో విప్లవకారులు ప్రాణాలర్పించారని గుర్తుచేశారు. ప్రజల విముక్తి కోసం తమ జీవితాలను అంకితం చేసిన అమరవీరుల త్యాగాలు విప్లవోద్యమ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు.

భాగ్యనగర్ తండాలో

పారిశుధ్య పనులకు ప్రత్యేక ప్రాధాన్యం

వర్షాల నేపథ్యంలో వ్యాధుల నివారణకు గ్రామవ్యాప్తంగా బ్లీచింగ్ చల్లింపు..

ప్రజారోగ్యమే ప్రథమ లక్ష్యం:

సర్పంచ్ బానోత్ హీరాలాల్

కారేపల్లి : గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు, పరిసరాల పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ భాగ్యనగర్ తండా గ్రామపంచాయతీలో పారిశుధ్య పనులను ముమ్మరం చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, తుపాను ప్రభావంతో పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగా శనివారం గ్రామంలోని అన్ని వీధుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు.శుక్రవారం డ్రై డే కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఈ పారిశుధ్య పనులను సర్పంచ్ బానోత్ హీరాలాల్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా సీజనల్ వ్యాధులను నివారించవచ్చని, ప్రజారోగ్య పరిరక్షణే తమ తొలి ప్రాధాన్యమని తెలిపారు. వర్షాల అనంతరం ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టడంతో పాటు, గ్రామంలో నిరంతరం పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని పేర్కొన్నారు. గ్రామ ప్రజలు కూడా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ పంచాయతీ సిబ్బందికి సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పెంద్ర అనిల్ కుమార్, వార్డు సభ్యుడు గాంధీ, మాజీ ఎంపీటీసీ బానోత్ రాంచందర్, పంచాయతీ సిబ్బంది హేంచంద్, నంద, రమేష్, రాందాస్, గణేష్, రాధా, లకన్, రాకేష్, రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

దీపావళి ఆఫర్ పేరుతో సైబర్ మోసాల వల..

ప్రజలూ తస్మాత్ జాగ్రత్త

ఎయిర్‌టెల్ పేరుతో రూ.2 వేల నకిలీ కానుక..

లింక్ తెరిస్తే బ్యాంకు ఖాతాలకు ముప్పు..

అప్రమత్తంగా ఉండాలని కారేపల్లి సీఐ నునావత్ సాగర్ సూచన

కారేపల్లి : పండుగల వేళ ప్రజలకు ఉచిత కానుకల ఆశ చూపుతూ సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని కారేపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నునావత్ సాగర్ తెలిపారు. దీపావళి కానుకగా ప్రముఖ టెలికాం సంస్థ ఎయిర్‌టెల్ రూ.2,000 నగదు అందిస్తోందంటూ వాట్సాప్, ఇతర సామాజిక మాధ్యమాల్లో ప్రచారం అవుతున్న సందేశాలు నకిలీవని పేర్కొన్నారు. ఇలాంటి సందేశాలను నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించారు.ఉచిత కానుకల మాటున మోసం..ఎయిర్‌టెల్ పేరుతో వస్తున్న లింక్‌లకు ఆ సంస్థకు ఎలాంటి సంబంధం లేదని సీఐ తెలిపారు. గుర్తుతెలియని లింక్‌లను తెరిస్తే వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతాల సమాచారం సైబర్ నేరగాళ్లకు చేరే ప్రమాదం ఉందన్నారు. ఉచిత నగదు, బహుమతుల పేరుతో వచ్చే సందేశాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అత్యాశకు పోయి కష్టార్జితాన్ని పోగొట్టుకోవద్దని తెలిపారు.

వైరా నియోజకవర్గ ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్

కారేపల్లి : వెలుగుల పండుగ దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని వైరా నియోజకవర్గ ప్రజలకు శాసనసభ్యుడు మాలోత్ రాందాస్ నాయక్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. చెడుపై మంచి, చీకటిపై వెలుగు, అజ్ఞానంపై జ్ఞానం సాధించిన విజయానికి ప్రతీకగా దీపావళి పండుగ నిలుస్తుందని పేర్కొన్నారు.దీపావళి అనేది కేవలం దీపాలు వెలిగించి సంబరాలు చేసుకునే పండుగ మాత్రమే కాదని, మనిషిలోని అహంకారం, అసూయ, ద్వేషం, చెడు ఆలోచనలను తొలగించుకొని ప్రేమ, మానవత్వం, ధర్మం, సత్యం అనే సద్గుణాలను ఆచరించాలనే గొప్ప సందేశాన్ని అందించే పర్వదినమని తెలిపారు.

బౌద్ధక్షేత్రం అభివృద్ధికి టూరిజం కారిడర్ ఏర్పాటు చేయాలి

- బౌద్ధక్షేత్రం అతి పెద్ద పర్యాటక కేంద్రంగా నిలుస్తుంది
- జాతీయ పురావస్తు శాఖ నిపుణులు వసంత్ షిండే

నేలకొండపల్లి, నవంబర్:07 మీ వార్త ఆర్ సి





నేలకొండపల్లిలోని చారిత్రక బౌద్ధక్షేత్రాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసి,ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు టూరిజం కారిడర్ ఏర్పాటు చేయాలని జాతీయ పురావస్తు శాఖ నిపుణులు వసంత్ షిండే సూచించారు. బౌద్ధక్షేత్రం,బైరాగిగుట్ట తదితర పరిసర ప్రాంతాల్లో ఇటీవల నిర్వహించిన పురావస్తు తవ్వకాల ప్రదేశాలను శనివారం ఆయన సందర్శించి పరిశీలించారు. తవ్వకాల్లో వెలుగుచూసిన పురాతన వస్తువులు, చారిత్రక ఆనవాళ్లను నిశితంగా పరిశీలించి, వాటి పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై పురావస్తు శాఖ అధికారులకు పలు సూచనలు, సలహాలు అందించారు.

బౌద్ధక్షేత్రం పరిసర ప్రాంతాల్లో చారిత్రక ప్రాధాన్యత కలిగిన అనేక ఆనవాళ్లు ఉన్నాయని,వాటిని వెలికితీసి పరిరక్షించడంతో పాటు భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆయన పేర్కొన్నారు. తవ్వకాలు నిర్వహించిన ప్రదేశాలను పర్యాటకులు సందర్శించేలా అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు.

అనంతరం బౌద్ధక్షేత్రం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వసంత్ షిండే మాట్లాడుతూ.. బౌద్ధస్థూపం అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం సంతోషకరమన్నారు. రాష్ట్ర రెవెన్యూ,గృహ నిర్మాణ,సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచన మేరకు బౌద్ధక్షేత్రాన్ని సందర్శించినట్లు తెలిపారు.ఈ ప్రాంత చారిత్రక విశిష్టతను గుర్తించి మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

చారిత్రక ప్రాధాన్యతను చాటే వాణిజ్య మార్గం

అమరావతి, విజయవాడ,మధిర, నాగులవంచ మీదుగా ఒకప్పుడు వాణిజ్య మార్గం కొనసాగినట్లు, ఈ ప్రాంతం ఒక నగరంగా విలసిల్లినట్లు తెలుస్తోందని వసంత్ షిండే వివరించారు. బౌద్ధక్షేత్రం పరిసర ప్రాంతాల్లో లభిస్తున్న పురాతన వస్తువులు, చారిత్రక ఆనవాళ్లు ఈ ప్రాంత గత వైభవాన్ని తెలియజేస్తున్నాయని పేర్కొన్నారు.ఈ ప్రాంత చరిత్రను మరింత లోతుగా అధ్యయనం చేసి,పురావస్తు సంపదను వెలికితీయాల్సిన అవసరం ఉందన్నారు.

బౌద్ధక్షేత్రం వద్ద తవ్వకాలు నిర్వహించిన ప్రదేశాలను పరిరక్షించేందుకు షెడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. వాతావరణ ప్రభావం, ఇతర కారణాల వల్ల పురాతన నిర్మాణాలు దెబ్బతినకుండా తగిన రక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. తవ్వకాల్లో బయటపడిన వస్తువులను భద్రపరిచి,వాటి చారిత్రక ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

మ్యూజియం ఏర్పాటు చేయాలి

బౌద్ధస్థూపం వద్ద ప్రత్యేక మ్యూజియం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని వసంత్ షిండే అభిప్రాయపడ్డారు. తవ్వకాల్లో లభించిన పురాతన వస్తువులు, శిల్పాలు,ఇతర చారిత్రక ఆధారాలను మ్యూజియంలో ప్రదర్శించడం ద్వారా బౌద్ధక్షేత్రం చరిత్రను పర్యాటకులకు సులభంగా వివరించవచ్చన్నారు. మ్యూజియం ఏర్పాటు వల్ల విద్యార్థులు, పరిశోధకులు,చరిత్రపై ఆసక్తి కలిగిన వారికి ఈ ప్రాంతం మరింత ఉపయోగకరంగా మారుతుందని పేర్కొన్నారు.

బౌద్ధక్షేత్రం అభివృద్ధికి టూరిజం కారిడర్ ఏర్పాటు చేయడం ద్వారా పర్యాటకుల రాకపోకలు పెరిగే అవకాశం ఉందన్నారు. పర్యాటకులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, చారిత్రక ప్రదేశాలకు చేరుకునే మార్గాలు, సమాచార కేంద్రాలు వంటి సౌకర్యాలను కల్పించడం ద్వారా ఈ ప్రాంతాన్ని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దవచ్చని సూచించారు.

అభివృద్ధిలో స్థానికులను భాగస్వాములను చేయాలి

బౌద్ధక్షేత్రం అభివృద్ధిలో స్థానిక ప్రజల సహకారం ఎంతో కీలకమని వసంత్ షిండే పేర్కొన్నారు. స్థానికులను అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని,వారి సహకారంతో చారిత్రక సంపదను పరిరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పర్యాటక రంగం అభివృద్ధి చెందితే స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉందన్నారు.

బౌద్ధక్షేత్రం చారిత్రక ప్రాధాన్యతను గుర్తించి సమగ్ర అభివృద్ధి చేపడితే భవిష్యత్తులో ఇది రాష్ట్రంలోనే ప్రముఖ పర్యాటక కేంద్రంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.పురావస్తు సంపద పరిరక్షణతో పాటు పర్యాటక అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా నేలకొండపల్లికి మరింత గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో పురావస్తు శాఖ డైరెక్టర్ అర్జునరావు,డిప్యూటీ డైరెక్టర్ పి.నాగరాజు, అసిస్టెంట్ డైరెక్టర్ గంగాదేవి,మల్లు నాయక్,వేదకుమార్, నేలకొండపల్లి తహశీల్దార్ పి. రాంప్రసాద్,సిద్ధార్థ ప్రకృతి ఆశ్రమం వైద్యులు కె.వై. రామచంద్రరావు, ఎన్విరాన్‌మెంట్ సంస్థ అధ్యక్షుడు దుడ్డెల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మంగాపురం తండా అంగన్వాడీ కేంద్రంలో సర్పంచ్ ఆకస్మిక తనిఖీ

- చిన్నారులు, గర్భిణులకు నాణ్యమైన పోషకాహారం అందించాలి:
- సర్పంచ్ ధీరావత్ అశోక్ రాణి

నేలకొండపల్లి నవంబర్:07 మీ వార్త ఆర్ సి



నేలకొండపల్లి: మండలంలోని మంగాపురం తండాలో ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ ధీరావత్ అశోక్ రాణి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.పంచాయతీ కార్యదర్శి రాధాకృష్ణ, మత్స్య పారిశ్రామిక ఉపాధ్యక్షుడు ధీరావత్ రాధాకృష్ణమూర్తితో కలిసి ఆమె అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి అక్కడ అందుతున్న సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులు, గర్భిణులకు అందిస్తున్న పోషకాహార నాణ్యతను,కేంద్రంలో నిర్వహిస్తున్న హాజరు రికార్డులను పరిశీలించారు. చిన్నారులకు, గర్భిణులకు ప్రభుత్వం నిర్దేశించిన విధంగా పౌష్టికాహారం అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ కేంద్రం ద్వారా అందించే సేవలు అర్హులైన ప్రతి ఒక్కరికీ సక్రమంగా చేరేలా సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు పౌష్టికాహారం ఎంతో అవసరమని, గర్భిణుల ఆరోగ్య పరిరక్షణలోనూ అంగన్వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తాయని సర్పంచ్ పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో అంగన్వాడీ కేంద్రాల్లో ఆహార నాణ్యత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకూడదని సూచించారు. చిన్నారులకు సమయానికి ఆహారం అందించడంతో పాటు, గర్భిణులకు అవసరమైన పోషకాహార సేవలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

అలాగే అంగన్వాడీ కేంద్ర పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పిల్లలకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలని సూచించారు. కేంద్రంలో పరిశుభ్రత, క్రమశిక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, హాజరు రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని పేర్కొన్నారు.

గ్రామస్థాయిలో ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సంక్షేమ సేవలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం ద్వారా వాటి అమలులో మరింత పారదర్శకత తీసుకురావచ్చని సర్పంచ్ అభిప్రాయపడ్డారు. అంగన్వాడీ కేంద్రాల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ చిన్నారులు, గర్భిణులకు మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాధాకృష్ణ,మత్స్య పారిశ్రామిక ఉపాధ్యక్షుడు ధీరావత్ రాధాకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మురసు తుఫాన్‌తో దెబ్బతిన్న చెరువుల శాశ్వత తాత్కాలిక మరమ్మతులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే జారె







దమ్మపేట నవంబర్ 7 మీ వార్త ఆర్ సి వనమాల శ్రీనివాసరావు:

- రైతులకు ఇబ్బందులు కలగకుండా తక్షణమే స్పందించిన ప్రభుత్వం



మురసు తుఫాన్ ప్రభావంతో గత నాలుగు రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు అశ్వారావుపేట నియోజకవర్గంలోని పలు చెరువులకు గండ్లు పడి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించింది రైతులకు సాగునీటి ఇబ్బందులు కలగకుండా చెరువుల శాశ్వత తాత్కాలిక మరమ్మతుల కోసం ఎఫ్‌డీఆర్ నిధుల కింద ప్రత్యేకంగా నిధులు కేటాయించింది.

ఈ క్రమంలో దమ్మపేట మండలంలో నాలుగు చెరువుల మరమ్మతు పనులకు అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ఈరోజు కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. నాగుపల్లి గ్రామంలో ముసలి బంధం చెరువు శాశ్వత మరమ్మతులకు రూ. 49.80 లక్షలు, దమ్మపేట మండల కేంద్రంలోని పేరంటాల చెరువు మరమ్మతులకు రూ. 47 లక్షలు, రాంజీ కుంట మరమ్మతులకు రూ. 8.50 లక్షలు, ఆసన్నగూడెం గ్రామంలోని రంగన్న కుంట శాశ్వత మరమ్మతులకు రూ. 39.50 లక్షలు ప్రభుత్వం కేటాయించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తుఫాన్ వల్ల దెబ్బతిన్న చెరువులకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేసిందని తెలిపారు. ప్రజల సమస్యలపై ప్రభుత్వం చూపుతున్న చొరవకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకి ,ఉమ్మడి ఖమ్మం జిల్లా మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డికి, తుమ్మల నాగేశ్వరరావుకి అశ్వారావుపేట నియోజకవర్గ ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు చీకటి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి మద్దిశెట్టి సత్య ప్రసాద్, పొదిలి జ్యోతి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కక్కిరాల రమేష్, ప్రధాన కార్యదర్శి వనమాల శ్రీనివాసరావు, దమ్మపేట సర్పంచ్ పడాల రమాదేవి రాంబాబు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిన్నశెట్టి యుగంధర్, గోపి, దమ్మపేట ఉపసర్పంచ్ ఆంగోత్ శ్రీను, పానుగంటి లక్ష్మణ్ గౌడ్, పిట్టల శ్రీను, గట్ల నాగరాజు, అన్నవరపు నాగేంద్ర వివిధ పంచాయతీల సర్పంచులు, కార్యకర్తలు ,నాయకులు ప్రజలు పాల్గొనడం జరిగింది.